

పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

## పుష్కరాల పనుల్లో వేగం పెంచాలి

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ**

మహదేవపూర్ (కాళేశ్వరం), ఏప్రిల్ 29 : కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాల పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీఐపీ ఘాట్, సరస్వతీ మాత విగ్రహం ఏర్పాటు, టెంట్ సిటీ ఏర్పాటు, పార్కింగ్ ప్రదేశాలు, జాయ్ రైడ్, సత్రం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఈవో కార్యాలయంలో పనుల పర్యవేక్షణ ప్రత్యేక అధికారులు, రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, రవాణా, వైద్య తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీఐపీ ఘాట్ వద్ద టెంట్ సిటీ, ఎగ్జిబిషన్, ఫుడ్ కోర్టు, స్టాళ్లు, కిడ్స్ జోన్ ఏర్పాటు చేసేందుకు మార్కింగ్ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. వీఐపీ ఘాట్ వెళ్లే రహదారి నిర్మాణానికి మార్కింగ్ చేయాలన్నారు. జాయ్ రైడ్, టెంట్ సిటీకు కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని పోలీసులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, దేవాదాయ శాఖల అధికారులు సంయుక్తంగా పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. విధులు నిర్వర్తించే సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, పార్కింగ్, ఆర్టీసీ ప్రదేశాల్లో సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని తెలిపారు. భక్తులు నదిలోకి వెళ్లడానికి అనువుగా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, దేవాదాయ శాఖ ఎస్ఈ కనకదుర్గ ప్రసాద్, డీపీవో నారాయణరావు, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థ, డీఎంహెచ్‌వో మధుసూదన్, ఇరిగేషన్ శాఖ ఈఈ తిరుపతిరావు, పంచాయతీరాజ్ శాఖ డీఈ రవి సాయిలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్వర్లు, నళిని, ఆబ్కారీ ఈఎస్ శ్రీనివాస్, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీరామ్‌రావు సేవలు అందరికీ ఆదర్శం

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 29: తక్కుళ్లపల్లి శ్రీరామ్‌రావు నిబద్ధతతో విధులు నిర్వర్తించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో నేడు ఉద్యోగ విరమణ చేయనున్న శ్రీరామ్‌రావు ఆత్మీయ అభినందన వీడ్కోలు సమావేశం నిర్వహించగా కలెక్టర్ హాజరై ఆయనను గజ మాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరామ్ రావు కలెక్టరేట్ సూపరింటెండెంట్ తహసీల్దార్ క్యాడర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సుదీర్ఘ కాలం రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో రవి, కలెక్టరేట్ ఏవో ఖాజా మొహినొద్దీన్, అబ్బాస్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

## అక్షరాస్యత పెంచడానికి కృషి చేయాలి

ములుగురూరల్, ఏప్రిల్ 29 : జిల్లాలోని ఈఆర్డీ, పాఠశాల, ఇంటర్మీడియట్, ఓపెన్ స్కూల్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, పంచాయతీ శాఖలు సమన్వయపర్చుకొని జిల్లాలో వయోజనుల అక్షరాస్యత పెంచడానికి కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. మంగళవారం ఆయన తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్డీ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళా నిరక్షరాస్యుల వివరాలు సేకరించాలన్నారు. అన్నిశాఖల పరిధిలోని వయోజనులైన వారిని గుర్తించి సకాలంలో విద్యాశాఖకు వారి వివరాలను అందజేయాలని సూచించారు. స్వచ్ఛందంగా వలంటీర్లను ఏర్పాటు చేసుకొని షెడ్యూల్ ప్రకారం అక్షరాస్యత పెంపొందించే కార్యక్రమాలు అమలు చేయాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, డీఈవో పాణిని, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, డీడబ్ల్యూవో శిరీష, డీపీవో దేవరాజు, డీఐఈవో చంద్రకళ, అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా నోడల్ అధికారి వేణుగోపాల్, ఐటీడీఏ హెచ్ఎం వేణుగోపాల్, ఓపెన్ స్కూల్ సొసైటీ బాధ్యులు అప్పని జయదేవ్, కోఆర్డినేటర్ గుళ్లపెల్లి సాంబయ్య ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

**I LOPELLI PRAVEEN RAO S/O LOPELLI KISHAN RAO**, Age: 41 years, R/o H.No. 16-7-250/A, Dayanand Colony, Warangal, Warangal Dist -506013, Telangana State, INDIA, . My name Changed from **LOPELLY PRAVEEN KUMAR S/O LOPELLI KISHAN RAO**, to **LOPELLI PRAVEEN RAO S/O LOPELLI KISHAN RAO**, for all purposes.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

రేగొండ, ఏప్రిల్ 29 : గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీడీవో రాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. గోరికొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఆయన కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండలు అధికం కావడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయన్నారు. దీంతో గ్రామాల్లో మంచినీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రైవేట్ బావులను అద్దెకు తీసుకొని మంచి నీటి సరఫరా చేయాలన్నారు. ప్రతి రోజూ కార్యదర్శులు గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించాలన్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

రేగొండ, ఏప్రిల్ 29 : అర్హులైన నిరుపేదలందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు ఆంక్షలతో ఇండ్లు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తున్నదన్నారు. అనర్హులకు ఇండ్లు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలని, ఎలాంటి ప్రభుత్వ పథకాలు తీసుకోవద్దని చెప్పడం వెనుక ఇండ్లు ఇచ్చే ఉద్దేశం లేనట్లు కనిస్తున్నదన్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా అర్హులందరికీ ఇండ్లు ఇవ్వాలన్నారు.



రజతోత్సవ సభలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

# రజతోత్సాహం

- సభ సక్సెస్‌తో గులాబీ శ్రేణుల్లో జోష్
- ప్రభుత్వంపై వ్యతిరేకత చూపించిన జనం
- స్థానిక సంస్థలకు సన్నద్ధమవుతున్న బీఆర్‌ఎస్ నేతలు

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : ఎల్కతుర్తి సభతో గులాబీ శ్రేణుల్లో నయాజోష్ నెలకొంది. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో క్షేత్రస్థాయి నుంచి క్యాడర్‌లో ఉత్తేజం కలుగుతున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధినేత కేసీఆర్ పాల్గొన్న బహిరంగసభకు అన్నివర్గాల ప్రజల నుంచి స్పందన రావడంతో మళ్లీ బీఆర్‌ఎస్సే అధికారంలోకి వస్తుందన్న నమ్మకం పార్టీ క్యాడర్‌లో పెరిగింది. సభకు అంచనాకు మించి తరలివచ్చిన జనం ప్రభుత్వంపై వ్యతిరేకతను కనబరిచారు. దేశంలోనే అతి పెద్ద సభగా చరిత్రలో నిలిచారు. 15 నెలల కాంగ్రెస్ పాలన అట్టర్ ఫ్లాప్ అని పాలకులకు గుర్తు చేశారు. ప్రస్తుతం గ్రామ గ్రామాన బీఆర్‌ఎస్ రజతోత్సవంపైనే చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో పార్టీ ఓటమి చెంది నిరాశలో ఉన్న క్యాడర్‌కు కేసీఆర్ ప్రసంగం జవసత్వాలు నింపింది. ఉరకలేస్తున్న ఉత్సాహంతో పార్టీ శ్రేణులు భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. స్థానిక సంస్థల్లో తమ సత్తా చేటేందుకు సిద్ధమవుతున్నారు. రజతోత్సవ సభ తేదీ ఖరారైన నాటి నుంచి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గ్రామ గ్రామాన తిరుగుతూ కార్యకర్తలు, ప్రజలను సభకు సన్నద్ధం చేశారు. కార్యరక్తలు సభకు సంబంధించిన వాల్ రైటింగ్స్ స్వయంగా రాస్తూ సభ సక్సెస్‌కు సైనికుల్లా పని చేశారు. ఊహించని విధంగా సభ సక్సెస్ కావడంతో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో నిర్వహించే అవకాశాలు లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతతో మరికొంత సమయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ ప్రసంగంతో పార్టీకి మళ్లీ పూర్వవైభవం సంతరించుకోబోతుందని, రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి వచ్చే ఎన్నికలు ఏవైనా సరే గులాబీ జెండాలు ఎగురవేస్తామని పార్టీ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేస్తున్నారు. బొగ్గు గనులను మళ్లీ గులాబీ మయం చేస్తామని నల్లసూర్యులు శపథం చేస్తున్నారు.

## ఆపరేషన్ కగార్‌ను ఆపాలి : మంత్రి సీతక్క

ములుగురూరల్, ఏప్రిల్ 29 : ఆదివాసీల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని మంత్రి సీతక్క మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్య భారతంలోని ఆదివాసీ ప్రాంతాలు రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పరిధిలోకి వస్తాయని, అక్కడ వారికి ప్రత్యేక హక్కుతోపాటు ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని అన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తూ రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలని అన్నారు. బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా సమస్య పరిష్కారమయ్యేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని అన్నారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారని, మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదన లకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని అన్నారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపిస్తాయని సీతక్క పేర్కొన్నారు.

**ఆదివాసీల హక్కులు కాపాడాలి..**

మంగపేట, ఏప్రిల్ 29 : ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి రాజ్యాంగ బద్ధమైన ఆదివాసీ హక్కులను కాపాడాలని తుడుందెబ్బ మండలశాఖ అధ్యక్షుడు డబ్బుల ముత్యాల రావు కోరారు. ముత్యాలరావు మాట్లాడుతూ దేశ విదేశ వాణిజ్య, సామ్రాజ్యవాదుల కార్పొరేట్ సంస్థలకు విలువైన ఖనిజ వనరులను కేంద్ర ప్రభుత్వం అప్పగించేందుకు ఒప్పందాలు చేసుకుని కగార్ ఆపరేషన్ చేస్తున్నదని ఆరోపించారు. ఇందులో భాగంగానే ఆదివాసీలకు అండగా ఉన్న మావోయిస్టులను అంతం చేసే కుట్ర జరుగుతుందని ధ్వజమెత్తారు. ఇరువర్గాల కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చల వైపు ప్రయత్నాలు చేయాలన్నారు. ఆదివాసీల రాజ్యాంగ హక్కులను కాపాడాలని కోరారు.

## వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 29 : అంబేద్కర్ క్రీడామైదానంలో మంగళవారం సాయంత్రం ఏరియా ఎస్‌వోటూ జీఎం పోశమల్లు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల పిల్లలు, ఏరియాలోని పరిసర ప్రాంతాల పిల్లలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి కే మారుతి, ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం ఐఈడీ జ్యోతి, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు అరుణ ప్రసాద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్శ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అసంక్రమిత వ్యాధులపై అవగాహన

ములుగురూరల్, ఏప్రిల్ 29 : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారులకు, సిబ్బందికి డీఎంహెచ్‌వో గోపాల్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ములుగులో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి జిల్లా కేంద్రంలో క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. మే 1నుంచి 2026 మార్చి 30వ తేదీ వరకు వైద్య సిబ్బంది అసంక్రమిత వ్యాధులపై నాలుగు విడుతలుగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. శిక్షణలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'చిన్న కాళేశ్వరం' కెనాల్‌పై గ్రామ సభ

మహదేవపూర్, ఏప్రిల్ 29 : మండలంలోని బొమ్మాపూర్‌లో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ తవ్వకాల భూ సేకరణ కోసం మంగళవారం అధికారులు రైతులతో గ్రామ సభ నిర్వహించారు. కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణలో భూమిని కోల్పోతున్న రైతుల పేర్లను అధికారులు చదివి వినిపించారు. కెనాల్ తవ్వకాలపై రైతులు తమ అభిప్రాయాలు, సూచనలు అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఇరిగేషన్‌శాఖ ఏఈఈ భరత్ ఆనంద్, సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి, జీపీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన పీవో

మంగపేట, ఏప్రిల్ 29 : ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా మంగళవారం ఇంజినీర్లతో కలిసి కోమటిపల్లి ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. అంతర్గత బహ్య పెయింటింగ్ చేపట్టడం, సంప్ క్లియరింగ్, డెస్లడ్జింగ్ ఆపరేటర్, విద్యుదీకరణ సమస్య, షాక్, డార్మిటరీ భాగం సమస్యలను పరిష్కరించాలన్నారు. వెనుక వైపు పాత స్టోర్ రూమ్, స్టాఫ్ క్వార్టర్స్ మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం తొండ్యాల్ లక్ష్మీపురం, వాగొడ్డుగూడెం, రమణక్కపేట గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. రమణక్కపేటలోని మరో ప్రతిపాదిత సీసీ రోడ్డును పరిశీలించి నాణ్యతతో సైడ్ బర్మ్‌లను నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రశాంత్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రాము, ప్రాజెక్టు మేనేజర్ ఎన్‌హెచ్ఎం మహేందర్, అధికారులు పాల్గొన్నారు.

## అటవీ పరిరక్షణకు పెట్రోలింగ్ వాహనం

ఏటూరునాగారం, ఏప్రిల్ 29 : జాతీయ రహదారి వెంట గస్తీ కోసం పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేస్తున్నట్లు అటవీశాఖ సీసీఎఫ్ బీ ప్రభాకర్ తెలిపారు. మండలకేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం వద్ద మంగళవారం సాయంత్రం హైవేపై పెట్రోలింగ్ వాహనం వజ్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాహనం నేషనల్ హైవేపై గస్తీ తిరుగుతుందన్నారు. ఎవరైనా అడవిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చిన్న నేరాలకు రూ. 25 వేలు జరిమానా విధించనున్నట్లు స్థానిక సౌత్ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. పెద్ద నేరాలకు కేసు నమోదైతే జైలు శిక్షణ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డీఎఫ్‌లో రాహుల్ జాదవ్, ఎఫ్డీవో రమేశ్, ఎఫ్ఆర్‌వో అబ్దుల్ రెహమాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల తీరుతో రైతు ఆత్మహత్యాయత్నం

- క్వింటాకు 10కిలోలు కట్ చేస్తున్నారని ఆవేదన
- మనోవేదనతో పురుగుమందు తాగేందుకు యత్నించిన కౌలురైతు
- మంత్రి సీతక్క ఇలాకలో ఘటన



పురుగు మందు తాగే ప్రయత్నం చేస్తున్న రాజు

గోవిందరావుపేట, ఏప్రిల్ 29 : ఆరుగాలం కష్టపడి పంట పండించడం ఒక ఎత్తయితే.. దానిని అమ్ముకోవడానికి రైతు అంతకంటే ఎక్కువ కష్టపడాల్సి వస్తున్నది. పంట చేతికొచ్చే సమయానికి కురిసిన వడగండ్ల వానతో పైరు దెబ్బతిని దిగుబడి తగ్గిపోయి, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. కొద్దిపాటి చేతికొచ్చిన ధాన్యాన్ని అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు తాలు, కోతలపేరుతో జలగల్లా పట్టిపీడిస్తున్నారు. చేతికొచ్చిన ధాన్యాన్ని అమ్ముకుందామని కొనుగోలు కేంద్రానికి వెళ్లిన రైతు క్వింటాలు 10 కిలోలు కట్ చేస్తుండాన్ని చూసి తట్టుకోలేక ఆరబోసిన ధాన్యం రాసి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పక్కనే ఉన్న రైతులు గమనించి పురుగుల మందు డబ్బాను లాగి రైతును కాపాడారు. ఈ ఘటన మంత్రి సీతక్క ఇలాక అయిన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులోని మంగళవారం జరిగింది. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన రైతు రోదిస్తూ వివరాలను వెల్లడించారు. రైతు మాటల్లో.... నా పేరు జెట్టి రాజు. మాది గోవిందరావుపేట మండలకేంద్రం. మొత్తం 6 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని మూడు ఎకరాల్లో ఆర్ఎన్ఆర్(సన్న రకం), మరో మూడు ఎకరాల్లో 1010(దొడ్డు రకం) పంటలు సాగు చేశాను. కొద్ది రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానకు పంట మొత్తం పాడైపోయింది. చేతికి వచ్చిన పంటను పట్టుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళితే దొడ్డు రకం ధాన్యానికి క్వింటాలు రెండు కిలోల చొప్పున కటింగ్ చేశారు. అలాగే సన్నరకం ధాన్యాన్ని తీసుకెళితే.. క్వింటాకు 10కిలోల కటింగ్ చేస్తామని అన్నారు. ఇదేంది అని అడిగితే అది అంతే అన్నారు. రైస్ మిల్లర్ల వద్దకు వెళ్లి అడిగినా 10 కిలోల కటింగ్ చేస్తామని అన్నారు. దీంతో నాకు చాలా బాధైంది. నా చావుతోనైనా రైతులకు మేలు జరగాలని పురుగుల మందు తాగే ప్రయత్నం చేసిన. నా దగ్గర ఏమీ లేదు. అప్పులపాలై మొన్ననే రూ.20లక్షలకు ఇల్లు అమ్ముకున్నా. నేను కౌలు రైతును. 10 బస్తాల దిగుబడి వస్తే అందులో కటింగ్ అంటే నాకు చావే శరణం అనుకున్నా. నా చావుతోనైనా రైతులకు న్యాయం జరుగుతుందని భావించిన. రైతుల కోసం నేను చావడానికైనా సిద్ధం. పురుగుల మందు తాగడం నా తప్పే. నా పైన సార్లు చర్య తీసుకున్నా కోర్టుకైనా వెళ్లి చెప్పుకుంటా.. అని తన గుండెల నిండా ఉన్న బాధను కౌలు రైతు రాజు కన్నీటి పర్యంతమవుతూ చెప్పాడు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ

చిట్యాల, ఏప్రిల్ 29 : రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. మంగళవారం మండలంలోని నైన్ పాక, జడల్‌పేట, ఒడితల, దూతుపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ, ఓడీసీఎంఎస్, మ్యాక్స్ సొసైటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం కాంగ్రెస్ అందుకుతండా గ్రామ అధ్యక్షుడు దేవదాస్ అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, చిట్యాల మార్కెట్ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి, నాయకులు గూట్ల తిరుపతి, మధు, వంశీకృష్ణ, కామిడి రత్నాకర్ రెడ్డి, అల్లకొండ కుమార్, పీఏసీఎస్ సీఈవో మెరుగు మొగిలి పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

**నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ శబరీశ్**



మాట్లాడుతున్న ఎస్పీ

ములుగురూరల్, ఏప్రిల్ 29 : పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసుల దర్యాప్తును పోలీసులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేర సమీక్ష నిర్వహించి మాట్లాడారు. దొంగతనాలు, ఆర్థిక నేరాల్లో ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించాలని అన్నారు. పాత కేసుల దర్యాప్తులో పురోగతి పెంచుతూ బాధితులకు న్యాయం అందేలా చూడాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలపై జరిగే నేరాల్లో విచారణ వేగవంతం చేయాలన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ వలలో పడకుండా స్టేషన్‌ల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. ప్రజలు సైబర్ నేరాల భారిన పడకుండా చూడాలన్నారు. సమీక్షలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీలు,సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## క్రీడాకారుడికి నాగజ్యోతి సన్మానం



రవిని సన్మానిస్తున్న నాగజ్యోతి

ములుగురూరల్, ఏప్రిల్ 29 : జాతీయ స్థాయిలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి పేరు తెచ్చిన తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారుడు కుర్సం రవిని మంగళవారం ములుగులో జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. నాగజ్యోతి మాట్లాడుతూ 35సార్లు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో రవి ప్రథమ స్థానం సాధించాడని అన్నారు. అనంతరం రూ. 12వేల నగదు బహుమతి రవికి అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చడం కోసం ఏ అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## ఉపాధ్యాయుడికి పురస్కారం

గణపురం, ఏప్రిల్ 29 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దాసరి చంద్రమౌళి 'మహ తి కవి భూషణ' పురస్కారం అందుకున్నా రు. మహతి సాహితి కవి సమ్మేళనం హైదరాబాద్ రవీంద్రభారతిలో సోమవారం జరిగిం ది. ఈ సమ్మేళనంలో తెలుగు రాష్ట్రాల కవులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి సుమారు 120 మంది కవులు కవితాగానం చేశారు. ఈ కవి సమ్మేళనంలో చంద్రమౌళి పెహల్గాం అమానుషంపై తన కవితను వినిపించారు. తన కవితా గానంతో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, సినీ గేయ రచయిత సాధనాల వెంకటస్వామి నాయుడు, జానపద కళా అకాడమీ పూర్వ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ వంటి ప్రముఖుల ప్రశంసలు పొందారు. అనంతరం కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా ముఖ్య, విశిష్ట అతిథుల సమక్షంలో మహతి అధ్యక్షుడు అడిగొప్పుల సదయ్య చంద్రమౌళికి సాహిత్య సేవ, తెలుగు భాషాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిస్తూ మహతి కవి భూషణ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో పొర్ల వేణుగోపాలరావు, యనమండ్ర వరలక్ష్మి, డీఎస్‌వీ మహాలక్ష్మి, దొంతరాజు విజయలక్ష్మి, ముక్కా సత్యనారాయణ, కామేశ్వర్‌రావు, మధు, మురళి పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు చంద్రమౌళి

## ఇందిరమ్మ ఇండ్లను నిలిపివేయాలని వినతి

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 29 : ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండా నిలిపివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొగ్గుల సమ్మయ్య, శ్యామల, వెంకటేశ్వర్లు, ఉయిక గోపి, శ్యామల వంశీ, కనిత శేషు తదితరులు పాల్గొన్నారు.

## ఓసీ త్రీ బాంబ్ బ్లాస్టింగ్‌తో కూలిన ఇంటి గోడ

గణపురం, ఏప్రిల్ 29: మండలంలోని పరశురాంపల్లి ఓసీ త్రీ బాంబ్ బ్లాస్టింగ్‌తో మంగళవారం గ్రామానికి చెందిన బోడ సాగర్ ఇంటి గోడ కూలిపోయింది. కాగా, అక్కడే ఆడుకుంటున్న పిల్లలకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. బాధితుడు సాగర్ కథనం ప్రకారం.. ఎస్సీ కాలనీలోని తన ఇంటి గోడ ఓసీ త్రీ బాంబ్ బ్లాస్టింగ్‌తో పూర్తిగా కూలిపోయిందన్నారు. అక్కడే ఆడుకుంటున్న పిల్లల మీద పడితే చనిపోయే వారని చెప్పారు. సింగరేణి అధికారులు ప్రతి రోజూ బొగ్గు కోసం బాంబ్ బ్లాస్టింగ్‌లు చేయడం వల్ల శబ్దానికి గ్రామంలోని ఇళ్ల గోడలు పగుళ్లు ఏర్పడడమే కాకుండా వస్తువులు కిందపడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామాన్ని ఖాళీ చేయించాలని కోరుతున్నారు.

## దళారులతో మోసపోతున్న రైతులు

టేకుమట్ల, ఏప్రిల్ 29 : మండలంలో దళారులు చిల్లర కాంటాలు నిర్వహించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతుల దగ్గర రూ.2,200 మక్కలు కొనుగోలు చేసి ప్రైవేట్ గోదాముల్లో నిల్వ చేసుకొని రెండు నెలల తర్వాత రూ.3,500 అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభాలను పొందుతున్నారు. కష్టపడి పండించిన రైతులకు మాత్రం అప్పులు తప్ప ఏమీ మిగలడంలేదన్నారు. దళారుల దందాను అధికారులు కట్టడి చేయాలని కోరారు.

## ఎస్సైకి రివార్డు పత్రం అందజేత

గోవిందరావుపేట, ఏప్రిల్ 29 : పస్రా ఎస్సై అచ్చ కమలాకర్‌కు మంగళవారం ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయతో కలిసి రివార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ నేర పరిశోధనలో ప్రతిభ కనబర్చినందుకు, గంజాయి, దొంగతనాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవడం, పీడీఎస్ రైస్ అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేయడం వంటి సేవలను గుర్తించి రివార్డు అందించినట్లు తెలిపారు. తనకు సహకరించిన అధికారులకు, స్టేషన్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఎస్సైకి సీఐ రవీందర్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 29 : మండల పరిధిలోని సూరవీడు గ్రామ సమీపంలోని మిర్చి తోటల్లో పనిచేస్తున్న కూలీలకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. వడదెబ్బ తగలకుండా మండలకేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో 84మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వారిలో 21మంది మహిళల వద్ద రక్త నమూనాలు సేకరించి పరీక్షల కోసం ములుగు ఏరియా వైద్యశాఖకు తరలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహారెడ్డి, అశీషపవన్, వినయ్, మహేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి స్థలాలకు ఫెన్సింగ్ వేయాలి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 29 : సింగరేణి భూములు కబ్జాకు గురికాకుండా ఫెన్సింగ్ వంటి చర్యలు చేపట్టాలని సింగరేణి జీఎం సెక్యూరిటీ ఆఫీసర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన భూపాలపల్లి ఏరియాలో పర్యటించి మాట్లాడారు. సింగరేణి భూములకు ఫెన్సింగ్ వేయడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సోలార్ ప్లాంట్‌లోని భద్రత చర్యలు, ఉప్పల్ నుంచి బొగ్గు రవాణాను పరిశీలించారు. బొగ్గు దొంగతనం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్‌తో చర్చించారు.

## విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలి

**భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే**

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 29 : ఉద్యోగ విరమణ అనంతరం జీవితం ప్రశాంతంగా గడపాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. టేకుమట్ల పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై పింగళి అమరేందర్‌రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సత్కరించి, గృహోపకరణాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నో సవాళ్లతో కూడుకున్న పోలీస్ ఉద్యోగం సంపూర్ణంగా పూర్తి చేసి విరమణ పొందడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నగేశ్, రత్నం, కిరణ్, శ్రీకాంత్, అమరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్‌కు విద్యుదాఘాతం

**పరిస్థితి విషమం**

మంగపేట, ఏప్రిల్ 29 : మండలంలోని మల్లూరులో ట్రాలీ ఆటో డ్రైవర్ మూత్ర విసర్జన చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన నవీన్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేసి తిరిగి వస్తున్న క్రమంలో మంగళవారం మల్లూరులోని శంభు లింగేశ్వర ఆలయ సమీపంలో రోడ్డు పక్కన మూత్ర విసర్జన చేస్తున్నాడు. వీధి లైట్ల కోసం ఏర్పాటు చేసిన ఎంసీబీ విద్యుత్ లైన్ కంచెకు ఉన్న ఫెన్సింగ్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన స్థానికులు నవీన్‌ను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాలకు తరలించారు.


## కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

ములుగురూరల్, ఏప్రిల్ 29 : అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. మే నెల మొత్తం వేసవి సెలవులు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మం త్రి సీతక్క క్యాంపు కార్యాలయం ముం దు ధర్నాకు ప్రయత్నించగా పోలీసులు అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ అరెస్టు చేశారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ తెలిపారు. పోలీసుల సూచన మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునిత, సమ్మక్క, సరిత, జమునరాణి, ధనల క్ష్మి, అరుంధతి, వెంకటరమణ, సడాలు, పార్వతి, సూరమ్మ, వసీమ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల ముందస్తు అరెస్టు

గోవిందరావుపేట, ఏప్రిల్ 29 : ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోవడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కలెక్టరేట్ ముట్టడికి వె ళ్తుండగా వారిని పస్రా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేశారు. తారసపడిన అంగన్‌వాడీ టీచర్లను ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మండలానికి చెందిన 16మంది ఉన్నట్లు తెలిసింది.

## అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



రవికిరణ్‌కుమార్(ఫైల్)

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 29 : మండలకేంద్రంలోని జక్కులవారి వీధిలో ఈ నెల 24వ తేదీన అదృశ్యమైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జక్కులవారి వీధికి చెందిన వాసం రవికిరణ్‌కుమార్(40) మిషన్ భగీరథలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన నీరు వదిలిపెట్టి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. అతని తల్లి సాలమ్మ అన్ని చోట్లా వెతికినా కనిపించపోవడంతో 25వ తేదీన రవికిరణ్‌కుమార్ కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. కాగా, మంగళవారం వీఆర్‌కేపురం సమీపంలోని పాలెంవాగు ప్రాజెక్టు కాలువ సమీపంలో మృతదేహం లభ్యమైందని తెలిపారు. అనారోగ్యంతోపాటు వడదెబ్బతగిలి పడిపోగా ఎవరూ గమనించకపోవడంతో మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని అన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.